జిల్లాకేంద్రంలో భారీ వర్షం

జలమయమైన పలు వీధులు

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 8: జిల్లావ్యాప్తంగా శనివారం ఓ మోస్తరు వర్షం కురిసినట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపారు. జిల్లాకేంద్రంలో సాయంత్రం కురిసిన భారీవర్షానికి రహదారులన్నీ జలమయమయ్యాయి. జిల్లాలో అత్యధికంగా కొత్తచెరువులో 17.8 మి.మీ, వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు. బుక్కపట్నం 14.2, పుట్టపర్తి 12.6, అమడగూరు 8.8, తాడిమర్రి 5.4, నల్లమాడ 5.2, ఓబుళదేవరచెరువు 4.2, చెన్నేకొత్తపల్లి 3.8, రొద్దం 3.8, తలుపుల 3.4, బత్తలపల్లి, కదిరి 3.2, రామగిరి 2.8, నల్లచెరువు 2.6, కనగానపల్లి 2.4, గాండ్లపెంట, తనకల్లు 2.2, సోమందేపల్లి 2.0, ధర్మవరం 1.6, ముదిగుబ్బలో 1.4 మి.మీ, వర్షపాతం నమోదైనట్లు తెలిపారు.

డీసీసీ అధ్యక్షుడిగా ఇనయతుల్లా



పుట్టపర్తి, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జిల్లా (డీసీసీ) అధ్యక్షుడిగా హెచ్ఎం ఇనయతుల్లా నియమితుడయ్యారు. ఆయా జిల్లాల నూతన కమిటీలను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా హిందూపురానికి చెందిన సీనియర్ నాయకుడు హెచ్ఎం ఇనయతుల్లాను నియమించారు. ఈయన హిందూపురం నుంచి 2014, 2024లో కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా పోటీచేసి, ఓడిపోయారు. ఇదివరకు మడకశిర మాజీ ఎమ్మెల్యే సుధాకర్ డీసీసీ అధ్యక్షుడిగా కొనసాగుతుండేవారు. ఆయన స్థానంలో ఇనాయతుల్లాను నియమించారు. పుట్టపర్తికి చెందిన కోటా సత్యనారాయణను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈయన పార్టీ ఉమ్మడి అనంత జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు.

లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడండి

జిల్లా ఎస్పీ రత్న



మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 8: లోక్‌అదాలత్‌లో రాజీకాదగ్గ కేసులను ఎక్కువభాగం పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ రత్న.. సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఆదివారం జిల్లాలోని పోలీసు అధికారులు, ఎస్ఐలు, కోర్టుకానిస్టేబుళ్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనెల 14న జాతీయ మెగాలోక్‌అదాలత్ నేపథ్యంలో జిల్లాలో రాజీకాదగ్గ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ.. రాజీ అయితే కోర్టుల చుట్టూ ఏళ్ల తరబడి తిరిగే అవసరం ఉండదన్నారు. దీనిపై కక్షిదారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.



ప్రశాంతి నిలయంలో పాటలు పాడుతున్న విద్యార్థులు

భక్తిశ్రద్ధలతో వినాయక చవితి

గణనాథా.. నమోస్తుతే..

- వాడవాడలా వెలసిన గణనాథులు
- వివిధ రూపాల్లో ఆకట్టుకుంటున్న ప్రతిమలు
- వినాయక మండపాల వద్ద సందడి

పుట్టపర్తి, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): వినాయక చవిత పర్వదినాన్ని జిల్లావ్యాప్తంగా శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వాడవాడలా వినాయక ప్రతిమలను కొలువుదీర్చి, ప్రత్యేక పూజలు చేశారు. హిందూపురం, ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, పెనుకొండ, మడకశిరతోపాటు మండల కేంద్రాలు, గ్రామాల్లో భారీ విగ్రహాలను ఏర్పాటు చేశారు. వినాయక మండపాల వద్దకు భక్తులు, యువత, చిన్నారులు భారీగా తరలివచ్చి, పూజల్లో పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా విభిన్న రూపాల్లో వినాయక ప్రతిమలు ఆకట్టుకుంటున్నాయి. వినాయక మండపాల వద్ద సందడి నెలకొంది. పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో నిర్వహించిన వినాయక చవితి పూజల్లో దేశ విదేశాల భక్తులు పాల్గొన్నారు. రామగిరి మండలం వెంకటాపురంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, హిందూపురంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వడ్డె అంజినప్ప పాల్గొని, పూజలు నిర్వహించారు.



హిందూపురంలోని కట్టకింద వాల్మీకి నగర్‌లో ఏర్పాటు చేసిన భారీ విగ్రహం



హిందూపురంలో ఏనుగుపై ఆశీనుడైన వల్లభ గణపతి

ఎడ్లబండ్ల పోటీలు



బుక్కపట్నం: మండలంలోని జానకంపల్లిలో వినాయక చవితి సందర్భంగా ఆదివారం ఎడ్లబండ్ల పోటీలు నిర్వహించారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పోటీలను ప్రారంభించారు. పరిసర గ్రామాల నుంచి భారీఎత్తున జనం హాజరయ్యారు. 54 ఎడ్లబండ్లు రాగా.. వర్షం కారణంగా పోటీలు నిలిపేశారు. ఫైనల్‌కు వచ్చిన 12 ఎడ్లబండ్లకు రూ.10వేలు చొప్పున నిర్వాహకులు అందజేశారు.

పోటీలను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

ప్రశాంతి నిలయంలో..

పుట్టపర్తి: స్థానిక ప్రశాంతినిలయంలో వినాయకచవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రశాంతినిలయం, విద్యాసంస్థల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి, ప్రత్యేక పూజలు చేశారు. గణేష్‌గేట్ వద్ద వినాయక విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయి కుల్వంత్ సభామండపంలో సంగీత కళాశాల విద్యార్థులు వీణ, తబలా వాయిద్యంతో భక్తులను అలరింపజేశారు. గంట పాటు సంగీత కచేరి నిర్వహించారు. రెండోరోజు ఆదివారం కూడా సంగీత కచేరి నిర్వహించారు. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



ప్రశాంతి నిలయంలో కొలువుదీరిన వినాయకుడు

నీరెట్లా పారేది..?

కాలువల మరమ్మతులపై గత ప్రభుత్వం నిర్లక్ష్యం

- పైసా నిధులివ్వని వైనం
- హంద్రీనీవా కాలువలో పెరిగిన పూడిక, కంపచెట్లు
- గండ్లు పడే ప్రమాదం
- అన్నదాతల్లో ఆందోళన



లేపాక్షి మండలం మామిడిమాకులపల్లి వద్ద మడకశిర ఉపకాలువ దుస్థితి

పుట్టపర్తి, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా జిల్లాలోని నీటి కాలువలు అధ్వాన్న స్థితికి చేరుకున్నాయి. పూడిక పేరుకుపోయింది. కంపచెట్లు పెరిగాయి. దీంతో నీరు ముందుకు కదిలే పరిస్థితి లేదు. హంద్రీనీవా కాలువ నీటితో రిజర్వాయర్లు, చెరువులను నింపకుండా గత వైసీపీ పాలకులు నిర్లక్ష్యం ప్రదర్శించారు. తద్వారా సాగు, తాగునీటికి కటకటలాడే పరిస్థితి తీసుకొచ్చారు. ఆయకట్టును ఎండబెట్టారు. హంద్రీనీవా కాలువ ద్వారా జిల్లాకు నీరు విడుదల చేసినప్పటి నుంచి తొలిసారిగా గతేడాది రిజర్వాయర్లు, చెరువులను ఎండబెట్టారు. గత ఐదేళ్లలో జీడిపల్లి-కుప్పం ప్రధాన కాలువతోపాటు మడకశిర ఉపకాలువ మరమ్మతులకు పైసా కూడా నిధులివ్వలేదు. కాలువల్లో పెరిగిన పిచ్చిమొక్కలను కూడా తొలగించలేదు. కాలువల లైనింగ్, మరమ్మతులు చేపట్టకపోడంతో ఎటుచూసినా ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, బలహీనపడిన కాలువ గట్లే కనిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో కాలువల్లో నీరు ఎట్లా పారుతుందన్న టెన్షన్ నెలకొంది. తుంగభద్ర, కృష్ణా నదులకు భారీ వరదలతో హంద్రీనీవా ద్వారా జిల్లాకు ఈఏడాది పుష్కలంగా నీరు చేరు వచ్చే అవకాశం ఉంది. అయితే, కాలువల్లో పెరిగిపోయిన పిచ్చిమొక్కలు, బలహీనపడిన గట్లు రైతులను కలవరపరుస్తున్నాయి. ఇప్పటికే జీడిపల్లి నుంచి గొలపల్లి రిజర్వాయర్‌కు నీరు వచ్చి చేరుతోంది. మరికొన్నిరోజుల్లో కుప్పం ప్రధాన కాలువకు నీరు వదిలే అవకాశం ఉంది. ఈనేపథ్యంలో కాలువుల్లో పెరిగిపోయిన ముళ్లపొదలను తొలగించి, బలహీనపడిన కాలువ గట్లకు మరమ్మతులు చేయాలని జిల్లా రైతాంగం వేడుకుంటోంది.



జానకంపల్లి వద్ద హంద్రీనీవా కాలువ గట్లపై పెరిగిన ముళ్ల పొదలు

ముందుకు కదిలేదెలా?

జీడిపల్లి-పుంగపూరు, కుప్పం ప్రధాన కాలువతోపాటు మడకశిర ఉపకాలువ కింద వందలాది చెరువులను నింపాల్సి ఉంది. జీడిపల్లి నుంచి కుప్పం వెళ్లే కాలువ ద్వారా రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల్లోని పలు చెరువులు, గొల్లపల్లి, మారాల, చెర్లోపల్లి రిజర్వాయర్లకు నీరివ్వాల్సి ఉంది. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర ఉప కాలువ కింద పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లో 265 చెరువులను నింపాల్సి ఉంది. జీడిపల్లి నుంచి జిల్లా మీదుగా కుప్పం వెళ్లే ప్రధాన కాలువ ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు, పూడికతో నిండిపోయింది. నీరు ముందుకు సాగాలంటే కొన్ని వారాలు పట్టే పరిస్థితి నెలకొంది. మడకశిర ఉపకాలువ పరిస్థితి మరీ అధ్వానం. 2018లో తొలిసారిగా నీరు వదిలారు. అప్పట్లో చేపట్టిన పనులే తప్ప.. మరమ్మతులు చేపట్టిన దాఖలాల్లేవు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి చెలివెందుల దాకా కాలువలో నీరు ముందుకు కదలాలంటే ఎక్కడ గండ్లు పడతాయోనన్న ఆందోళన నెలకొంది. గతంలో కాలువకు గండ్లుపడ్డాయి. లేపాక్షి నుంచి మడకశిరదాకా కాలువ అధ్వానంగా ఉంది. గతేడాది కోనాపురం ఎల్ 5, ఎల్ 4 మధ్య కాలువకు గండిపడితే నాలుగు రోజులు మరమ్మతులు చేశారు. గత ప్రభుత్వం జీడిపల్లి-కుప్పం, మడకశిర ఉపకాలువ మరమ్మతులకు నిధులివ్వకపోవడంతో కాలువల్లో నీరు పారించేందుకు హంద్రీనీవా అధికారులు రాత్రింబళ్లు కాలువ గట్లపై కాపలా కాయాల్సి వచ్చింది. 2021-22లో ఎగువన కర్ణాటకలో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో హంద్రీనీవా జలాలతో పనిలేకుండా చెరువులు వరద నీటితో పొంగిపొర్లాయి. కాలువల మరమ్మతులు, నిర్వహణ గాలికొదిలేసి జీడిపల్లి నుంచి రెండోదశ కింద వచ్చిన నీరంతా కుప్పానికి కృష్ణా నీళ్ల పేరిట షో కోసం సీఎం జగన్ పుంగపూరు కాలువలో మూడు నెలలు నీరు తీసుకెళ్లారు. గతేడాది గొల్లపల్లి, మారాల, చెర్లోపల్లి రిజర్వాయర్లకు అరకొరగా నీరిచ్చారు. ఈసారి చెరువులు నింపే అవకాశం ఉన్నా.. కాలువలపైనే బెంగ ఉంది. కాలువల్లో పెరిగిన ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు అడ్డురావనీ, నీరు వదలితే ప్రవాహానికి కొట్టుకుపోతాయని హంద్రీనీవా అధికారులు చెబుతున్నా.. యంత్రాంగంలో మాత్రం ఆందోళన నెలకొంది.

మరమ్మతులేవీ?



మడకశిర ఉప కాలువలో పూడిక, ముళ్ల పొదలు పెరిగిపోయాయి. కాలువ కుంచించుకుపోయింది. మొదట్లో నీరు వదలినపుడు చేసిన పనులే నేటికీ కనిపిస్తున్నాయి. కాలువలో నీరు వదిలితే నెమ్మదిగా వెళ్లే పరిస్థితి ఉంది. పూడిక, పిచ్చి మొక్కలు తొలగిస్తే నీరు వేగంగా పారుతుంది.

- హబీబ్‌ఖాన్, రైతు, మామిడిమాకులపల్లి, లేపాక్షి

కాలువ నిర్వహణ గాలికొదిలేశారు



గత వైసీపీ ప్రభుత్వం మడకశిర ఉప కాలువ నిర్వహణకు నిధులు కేటాయించకుండా గాలికొదిలేసింది. గతేడాది కాలువకు నీరివ్వకుండా ఎండబెట్టారు. కాలువ లైనింగ్‌కు మరమ్మతులు చేసి, మధ్యలో పెరిగిన ముళ్లపొదలు తొలగిస్తే నీరు ముందుకు కదులుతుంది.

- నాగరాజు, రైతు, కోనాపురం, పెనుకొండ మండలం



కోనాపురం వద్ద మడకశిర ఉప కాలువకు గతేడాది పడిన గండి

సూపర్‌సిక్స్ అంటూ కూటమి ప్రభుత్వం మోసం

- వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 8: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలైన సూపర్‌సిక్స్ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందని వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ విమర్శించారు. జిల్లా అధ్యక్షురాలిగా ఎంపికైన సందర్భంగా ఆమె ఆదివారం పెనుకొండకు వచ్చారు. పట్టణంలోని మడకశిర రహదారి పక్కన వైసీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలైనా సూపర్‌సిక్స్ పథకాల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. ఇదంతా ప్రజలు గమనిస్తున్నారనీ, వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి గట్టి గుణపాఠం చెబుతారని ఎద్దేవా చేశారు.



మాట్లాడుతున్న ఉషశ్రీ

పట్టుపురుగు జన్యుమార్పిడికి అనుమతి ఇప్పించండి

అనంత ఎంపీకి పరిశోధన కేంద్రం డైరెక్టర్ వినతి

హిందూపురం, సెప్టెంబరు 8: పట్టుపురుగుల్లో పాలపురుగు రోగాలను తట్టుకుని పెరిగే జన్యుమార్పిడి పట్టుపురుగులు సంకరజాతి రకాలను ఎన్నుకునేందుకు అనుమతి ఇప్పించాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను రాష్ట్ర పట్టుపరిశోధన, అభివృద్ధి సంస్థ డైరెక్టర్ సీతారాములు కోరారు. ఆదివారం హిందూపురంలోని అంబికా నివాసంలో ఆయన కలిశారు. ఆయన మాట్లాడుతూ.. పట్టుపురుగుల్లో పాలరోగం వస్తే రైతు తీవ్రంగా నష్టపోతాడు. దీంతో పరిశోధన కేంద్రంలో పాలపురుగు రోగాన్ని తట్టుకుని పెరిగే జన్యుమార్పిడి పట్టుపురుగుల సంకరజాతులను ఎన్నుకుని రైతులవద్ద పరీక్షించడానికి జెనెటిక్ ఇంజనీరింగ్ అప్రైసల్ కమిటీకి పంపడం జరిగింది. దీంతో ఢిల్లీకి సంబంధించిన శాస్త్రవేత్తలు అనుమతిచ్చారు. ఈ సంకర జాతికి సంబంధించి పట్టుపురుగులను రైతులకు అందుబాటులో తీసుకురావడానికి కావాల్సిన సహాయ సహకారాలు అందివ్వాలన్నారు. దీనికి సంబంధించి ఒక అనుమతి వచ్చిందని రెండో అనుమతి కోసం పంపడం జరిగింది. దీంతో ఢిల్లీలో ఉన్న పట్టుపరిశోధన కేంద్రం సంబంధించి అధికారులతో మాట్లాడి రెండో అనుమతి త్వరగా వచ్చేలా చూడాలని ఎంపీ కోరారు. ఈ విషయం సెంట్రల్ సిల్కుబోర్డ్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి చర్చించడం జరుగుతుందన్నారు. అంతేకాక పట్టుపరిశోధన కేంద్రానికి సంబంధించి అభివృద్ధికి నిధులు పెంచేలా చూస్తానని హామీ ఇచ్చారు.



ఎంపీ అంబికాకు వివరిస్తున్న పరిశోధన కేంద్రం డైరెక్టర్

మురిసిన అనంత..

దులీప్ ట్రోఫీ మ్యాచ్‌తో అభిమానుల్లో ఆనందం

శ్రేయాస్ సేనపై రుతురాజ్ టీం గెలుపు

మానవ్‌సుతార్ ఆల్‌రౌండ్ షో



మ్యాచ్‌లోని ఓ దృశ్యం



అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 8: దులీప్ ట్రోఫీ మ్యాచ్‌తో అనంత మురిసింది. స్టార్ల సందడితో అభిమానుల్లో ఆనందం ఉప్పొంగింది. తొలి మ్యాచ్‌లో ఇండియా సీ జట్టు గెలుపొందింది. ఒకరోజు మిగిలివుండగానే మ్యాచ్ ముగిసింది. జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన మానవ్ సుతార్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

మొదటి ఇన్నింగ్స్‌లో 164 పరుగులకు ఆలౌటైన ఇండియా డీ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 236 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 54 పరుగులు, దేవ్‌దత్ పడిక్కల్ 56, రికీ భుయ్ 44 రాణించారు. మిగతా బ్యాట్స్‌మెన్ నిరాశపరిచారు. మొదటి ఇన్నింగ్స్‌లో జట్టును ఆదుకున్న అక్షర్ పటేల్ రెండో ఇన్నింగ్స్‌లో 28 పరుగులకే ఔటయ్యాడు. ఇండియా సీ బౌలర్లలో మానవ్‌సుతార్ 7, వైశాక్ 2, అన్షుల్ కాంబోజ్ వికెట్ తీశారు.

రెండో ఇన్నింగ్స్‌లో రాణించిన ఇండియా సీ జట్టు

మొదటి ఇన్నింగ్స్‌లో 168 పరుగులకే ఆలౌటైన ఇండియా సీ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో పుంజుకుంది. రుతురాజ్ గైక్వాడ్ 46 పరుగులు, ఆర్యన్ జ్యూయెల్ 47, పటీదార్ 44, అభిషేక్ పొరెల్ 35, మానవ్‌సుతార్ 19 రాణించారు. దీంతో నాలుగు వికెట్ల తేడాతో విజయాన్ని నమోదు చేసుకుంది. ఇండియా డీ బౌలర్లలో శరాన్ష్ జైన్ 4 వికెట్లు, అర్షదీప్‌సింగ్, అక్షర్‌పటేల్ చెరో వికెట్ పడగొట్టారు. మ్యాచ్ అనంతరం మీడియా సమావేశానికి కెప్టెన్లు హాజరుకాకపోవడం విమర్శలకు తావిస్తోంది. వారి స్థానంలో ప్లేయర్లు మాట్లాడారు. కాగా ఇద్దరు కానిస్టేబుళ్ల ఓవరాక్షన్‌తో మ్యాచ్‌ను వీక్షించేందుకు వెళ్తున్న వీఐపీలు ఇబ్బందిపడ్డారు. ఇతర పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కబెట్టారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న క్రికెటర్లు

అభిమానుల సందడి

భారత ఆటగాళ్ల ఆటను ప్రత్యక్షంగా చూసే అవకాశం రావడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా క్రికెట్ అభిమానులు తరలివచ్చారు. దీంతో ఏసీజీ అభిమానులతో కిక్కిరిసింది. స్టార్ ప్లేయర్లను తమ కెమెరాల్లో బంధించారు. బీసీసీఐ ప్రతినిధి అమిత్ సిద్దేశ్వర్, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ త్రీమెన్ కమిటీ సభ్యుడు మాంచోఫెర్రర్, దులీప్‌ట్రోఫీ ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి షాబుద్దీన్, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, ఆర్డీఓ వసంతబాబు, పగడాల మల్లికార్జున, మెడికల్ టీం డాక్టర్ సుప్రజాచౌదరి తదితరులు మ్యాచ్‌ను వీక్షించారు.



యువత కేరింత..



మ్యాచ్‌ను ఆసక్తిగా తిలకిస్తూ..



ఈలలు, అరుపులతో...



స్టేడియంలో డ్రమ్స్...



విదేశీ వనితలు..

నేడు జిల్లాకు రానున్న క్రికెట్ జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 8: దులీప్‌ట్రోఫీలో భాగంగా సోమవారం ఇండియా-ఏ, ఇండియా-బీ జట్లు జిల్లాకు రానున్నాయి. నగరంలోని ఓ హోటల్‌లో సోమవారం బస చేయనున్నారు. మంగళవారం ఇరు జట్లు నెట్‌ప్రాక్టీస్‌లో పాల్గొననున్నాయి. ఈనెల 15 నుంచి ఏసీజీ-ఏ గ్రౌండ్‌లో ఇండియా-ఏ, ఇండియా-డీ జట్ల మధ్య పోటీ జరగనుంది. ఏసీజీ-బీ గ్రౌండ్‌లో ఇండియా-బీ, ఇండియా-సీ జట్ల మధ్య మ్యాచ్ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

విద్యుత్ హీటర్ తగలి వృద్ధురాలి మృతి

బుక్కరాయసముద్రం, సెప్టెంబరు 8: మండలంలోని వెంకటాపురం గ్రామంలో ప్రమాదవశాత్తు విద్యుత్ హీటర్ తగిలి కుళ్లాయమ్మ (72) మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వెంకటాపురం గ్రామానికి చెందిన కుళ్లాయమ్మ శనివారం ఉదయం స్నానం చేయడానికి వేడి నీటి కోసం ఇంట్లో ఉన్న కరెంటు హీటర్‌ను ఆన్‌చేసింది. ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడటంతో హీటర్‌పై వృద్ధురాలి చేయి పడింది. విద్యుత్ షాక్ తగిలి, అక్కడికక్కడే మృతిచెందింది. బుక్కరాయసముద్రం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యను క్రికెట్ బ్యాట్‌తో కొట్టి హత్య

బుక్కరాయసముద్రం, సెప్టెంబరు 8: భార్య కళావతి (31)ని భర్త గంగాధర్ క్రికెట్ బ్యాట్‌తో కొట్టి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. కళ్యాణదుర్గం రూరల్ గ్రామానికి చెందిన గంగాధర్ ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. బీ కొత్తపల్లి గ్రామానికి చెందిన కళావతిని ప్రేమవివాహ చేసుకుని గుజ్జల సరళాదేవినగర్‌లో నివాసం ఉంటున్నాడు. రెండు సంవత్సరాలుగా గంగాధర్ మద్యానికి బానిసై భార్యతో తరచూ గొడవపడేవాడు. దీంతో భార్య పుట్టింటికి వెళ్లింది. శనివారం ఆమె పుట్టింటికి వెళ్లి నిద్రిస్తున్న ఆమెను క్రికెట్ బ్యాట్‌తో తలపై కొట్టి హత్య చేశాడు. బుక్కరాయసముద్రం సీఐ కరణాకర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి పడి వృద్ధుడి మృతి

గుత్తి, సెప్టెంబరు 8: గుత్తి జీఆర్పీ పరిధిలోని పాతకొత్తచెరువు రైల్వే స్టేషన్ సమీపంలో రైలులో నుంచి పడి సాంబయ్య(73) మృతిచెందినట్లు జీఆర్పీ ఎస్ఐ నాగప్ప ఆదివారం తెలిపారు. కర్ణాటక రాష్ట్రం యాదగిరి పట్టణానికి చెందిన సాంబయ్య.. కుటుంబ సభ్యులతో కలిసి రైలులో తిరుపతికి దైవదర్శనానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో శనివారం రైలు పాతకొత్తచెరువు స్టేషన్ సమీపంలోకి రాగానే సాంబయ్య వాష్‌రూంకి వెళ్లి వచ్చే సమయంలో ప్రమాదవశాత్తు జారి కింద పడి మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్ఐ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య అంబమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డుప్రమాదంలో యువకుడు...

ఇద్దరికి తీవ్రగాయాలు



సాయినాథ్ (ఫైల్)

యాడికి, సెప్టెంబరు 8: మండలకేంద్రం సమీపంలో శనివారం రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. యాడికికి చెందిన సాయినాథ్ (25), ధర్మేంద్ర, లోకేశ్ స్నేహితులు. వీరు శనివారం ఒకే ద్విచక్రవాహనంలో రాయలచెరువుకు వెళ్లారు. కొద్దిసేపటి తర్వాత తిరిగి యాడికికి బయలుదేరారు. యాడికి సమీపంలోకి రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడింది. ప్రమాదంలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే వారిని యాడికి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తర్వాత తాడిపత్రికి తరలించారు. సాయినాథ్ పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలుకు తరలించగా.. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు.

తండ్రికి చేదోడువాదోడుగా సాయినాథ్

సాయినాథ్ యాడికిలోనే డాబా నిర్వహించే తన తండ్రి లింగమయ్యకు చేదోడుగా ఉండేవాడు. లింగమయ్యకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. చిన్న కుమారుడు సాయినాథ్ తండ్రికి చేదోడుగా ఉంటూ డాబా పనులు చూసుకునేవాడు. అతడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

మహాసమాధిని దర్శించుకున్న మాజీ క్రికెటర్లు



సత్యసాయి చిత్రపటాలతో మాజీ క్రికెటర్లు

పుట్టపర్తి, సెప్టెంబరు 8: మాజీ క్రికెటర్లు చేతన్‌శర్మ, అజయ్‌మల్హోత్రా, బీసీసీఐ మేనేజర్ అమిత్‌సిద్దేశ్వర్, రంజీ మాజీ క్రికెటర్ షాబుద్దీన్ ఆదివారం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. వినాయకచవితి సందర్భంగా ప్రశాంతినిలయం చేరుకుని సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అనంతరం ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యుడు విజయ్ వారికి సత్యసాయి చిత్రపటాలను అందజేసి, సన్మానించారు.

ఆర్టీసీ బస్సు బోల్తా



బోల్తా పడిన బస్సు

బత్తలపల్లి సెప్టెంబరు 8: మండలంలోని గుమ్మళ్లకుంట వద్ద ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. ఈ సంఘటనలో ముగ్గురు ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. అనంతపురం డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు శనివారం నల్లమాడకు వెళ్లింది. తిరిగి 30 మంది ప్రయాణికులతో వస్తుండగా బత్తలపల్లి మండలం గుమ్మళ్లకుంట వద్ద ఆ బస్సు అదుపుతప్పి పక్కనున్న గుంతలోకి బోల్తాపడింది. అటుగా వెళ్తున్న వాహనాదారులు, రైతులు బస్సులోని వారిని బయటకు తీశారు. బస్సు డ్రైవర్ లక్ష్మయ్య, కండక్టర్ రాజశేఖర్, పాముదుర్తికి చెందిన మంగమ్మ స్వల్పగాయాలతో బయటపడ్డారు. వారిని 108 వాహనంలో ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. బత్తలపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.





గాయపడిన ప్రయాణికురాలు,
కండక్టర్‌ను మోసుకొస్తున్న స్థానికులు

నిధుల స్కాం..!

- డీసీఈబీ వేదికగా అక్రమాలు
- లేని అధికారులు ఉన్నట్లు ఉత్తర్వుల సృష్టి
- ఫేక్ వర్క్ ఆర్డర్లతో నిధుల దోపిడీ
- ఫిబ్రవరిలో జిల్లాకు డీఈఓ వరలక్ష్మి
- డిసెంబరులోనే వచ్చినట్లు నకిలీ వర్క్‌ఆర్డర్, బిల్స్
- రూ. 31. 80 లక్షల వర్క్ కోసం ఉత్తర్వుల తయారీ
- ఇద్దరు డీఈఓల్లో ఎవరికీ తెలియకుండా బురిడీ కొట్టించారా..?
- పాత డీఈఓ కాలంలో కొత్త డీఈఓ పేరున అక్రమాలు





జిల్లా విద్యాశాఖ, డీసీఈబీ కార్యాలయాలు

అనంతపురం విద్య, సెప్టెంబరు 8: జిల్లా విద్యాశాఖలో ఇన్నాళ్లు...చిన్న చిన్న అక్రమాలే చూశాం. కానీ కనీవినీ ఎరుగని దారుణాలు ఒక్కటొక్కటిగా బయటపడుతున్నాయి. లేని అధికారులు ఉన్నట్లు.. నకిలీ ఫైళ్లు, రికార్డులు సృష్టించి పరీక్షల ఫీజుల నిధులను భోంచేస్తున్నారు. లక్షలాది రూపాయలు దోచేస్తున్నారు. విద్యాశాఖ పరిధిలోని జిల్లా సాధారణ పరీక్షల మండలి (డీసీఈబీ) వేదికగా లక్షలాది రూపాయలు స్కాం సాగినట్లు స్పష్టమవుతోంది. పరీక్షల ప్రశ్నపత్రాల కోసం డబ్బులు కట్టిన వందలాది స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు, ఇటు ప్రైవేట్ స్కూళ్ల కరస్పాండెంట్ల కళ్లు గప్పి, సాక్షాత్తు విద్యాశాఖ డీఈఓ కళ్లకు గంతలు కట్టి దర్జాగా నిధులు భోంచేస్తున్నారు. 2023-2024 ఏడాదికి సంబంధించిన ఎఫ్ఏ-3 ప్రశ్నపత్రాలు(సీబీఏ ప్రశ్నపత్రాలు), ఓఎంఆర్ షీట్స్ ముద్రణలో చేసిన అక్రమాలు భారీగానే బయటపడుతున్నాయి. 2023 డిసెంబర్‌లో ఒకరు డీఈఓగా ఉన్నారు. ఫిబ్రవరిలో డీఈఓగా మరో అధికారి వచ్చారు. ఫిబ్రవరిలో వచ్చిన కొత్త డీఈఓ పేరుపై డిసెంబరులో ఈ వర్కు ఆర్డర్, ఇతర సర్టిఫికెట్లు ఉత్తర్వులు సృష్టించింది. ఈ బాగోతంలో లక్షలాది రూపాయలు గోల్‌మాల్ సాగినట్టు తేటతెల్లమవుతోంది.

డీసీఈబీ ద్వారా ముద్రణ

జిల్లావ్యాప్తంగా 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ అన్ని యాజమాన్య విద్యార్థులకు (ప్రైవేట్ ప్రైమరీ విద్యార్థులు మినహా) అందరికీ 2023-24 విద్యా ఏడాదికి సంబంధించిన ఎఫ్ఏ-3 ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్స్ ముద్రించి పంపిణీ చేసే వర్కులో భారీగానే అక్రమాలు జరిగినట్టు స్పష్టమవుతోంది. ఏకంగా ఫేక్ ఉత్తర్వులు సృష్టించారంటే ఏ స్థాయిలో జరిగిందో ఇక చెప్పనక్కరలేదు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యార్థుల నుంచి ప్రశ్నపత్రాల కోసం ఫీజులు వసూలు చేసి, డీసీఈబీ వద్ద జమ చేస్తారు. తర్వాత ప్రైవేట్ ప్రింటర్ల వద్ద ప్రశ్నపత్రాలు ముద్రణ చేసి, స్కూళ్లకు సప్లై చేస్తారు. 2023-24 ఎఫ్ఏ-3 ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్‌షీట్స్ ముద్రణలో భారీగా అక్రమాలు జరిగాయి. అనంతపురం జిల్లాలోని 31 మండలాలకు ఫార్మెటివ్ అసెస్మెంట్ (ఎఫ్ఏ)-3 ప్రశ్నపత్రాలు ముద్రించి సరఫరా చేయడానికి చీరాలలోని కేకే ప్రింటర్స్‌కు వర్క్ ఆర్డర్ ఇచ్చారు. అదేవిధంగా 31 మండలాలకు సరఫరా ఓఎంఆర్ షీట్స్ కూడా ముద్రణ చేసి సరఫరా చేయడానికి వర్క్ ఆర్డర్‌ను తెనాలిలోని కమలా ప్రింటర్స్‌కు ఇచ్చారు. ఈ మేరకు నకిలీ వర్క్ ఆర్డర్లు, బిల్స్ సృష్టించారు. ప్రశ్నపత్రాలు ముద్రణ సప్లై చేసినందుకు చీరాలకు చెందిన కేకే ప్రింటర్స్‌కు రూ. 24,99,541, ఓఎంఆర్ షీట్స్ ముద్రణ చేసి సప్లై చేసినందుకు తెనాలిలోని కమల ఆర్ట్స్ ప్రింటర్స్‌కు రూ. 6,80,416 చెల్లించేలా వర్క్‌ఆర్డర్ సృష్టించారు. ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్స్ కోసం రెండు ప్రింటింగ్ ప్రెస్‌లకు రూ. 31.80 లక్షలకుపైగా చెల్లించేలా ఉత్తర్వులు సృష్టించారు.

లేని డీఈఓ ఉన్నట్లు..

జిల్లా సాధారణ పరీక్షల మండలి(డీసీఈబీ)కి జిల్లా విద్యాశాఖాధికారి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. డీసీఈబీకి కార్యదర్శి ఒకరు ఉంటారు. ఎవరైనా ఒక ప్రధానోపాధ్యాయుడిని డీసీఈబీ కార్యదర్శిగా డీఈఓ ఎంపిక చేశారు. అయితే డీసీఈబీకి చైర్మన్‌గా ఉండే డీఈఓ సంతకాలు చేస్తేనే ఎలాంటి ఉత్తర్వులైనా, బిల్లులైనా పాస్ అవుతాయి. ప్రశ్నపత్రాల ముద్రణ, బిల్లుల చెల్లింపు జరగాలంటే డీసీఈబీకి చైర్మన్‌గా వ్యవహరించే డీఈఓ సంతకాలు కీలకం. అయితే 2023-2024 ఏడాదికి సంబంధించిన ఎఫ్ఏ-3 ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్-షీట్స్ ముద్రణకు సంబంధించిన వర్క్ ఆర్డర్‌ను కొందరు డీసీఈబీలోని కొందరు అధికారులు నకిలీ సృష్టించారు. డీఈఓ వరలక్ష్మి జిల్లాకు ఈ ఏడాది ఫిబ్రవరిలో వచ్చారు. పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు ఈ ఏడాది ఫిబ్రవరి 6 తేదీ జీవో నెంబర్ 46 విడుదల చేస్తూ డీఈఓలను నియమించారు. ఫిబ్రవరి 6న డీఈఓల నియామక జీవో రాగా వరలక్ష్మి ఫిబ్రవరి 10వ తేదీ అనంతపురం డీఈఓగా విధుల్లో చేశారు. అయితే ఆమె డిసెంబరులోనే ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్స్ ముద్రణకు, సప్లైకు సంబంధించిన ఉత్తర్వులిచ్చినట్టు డీసీఈబీ అధికారులు సృష్టించడం మైండ్ బ్లాంక్ చేస్తోంది.

అక్రమాలు ఇలా...

డీఈఓ వరలక్ష్మి ఈ ఏడాది ఫిబ్రవరి 10వ తేదీ విధుల్లో చేశారు. అయితే ఆమె 2023 డిసెంబరు 15వ తేదీనే ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్స్ ముద్రణ, సప్లైకు సంబంధించిన వర్క్ ఆర్డర్స్‌ను సృష్టించారు. అంతేకాకుండా క్వాలిటీ అష్యూరెన్స్ సర్టిఫికెట్లు కూడా తయారుచేశారు. వీటిని డీఈఓ వరలక్ష్మి పేరు మీద తయారు చేయడం, ఆమె సంతకాలు కూడా లేకుండా కేవలం ఉత్తర్వులు డీసీఈబీ ఉన్నతాధికారులు సంతకాలు పెట్టడం విమర్శలకు తావిస్తోంది. ఫిబ్రవరిలో డీఈఓగా వరలక్ష్మి వస్తే ఆమె డిసెంబరులోనే వచ్చినట్లు ఫేక్ ఉత్తర్వులు రెడీ చేయడంపై అనేక విమర్శలు వస్తున్నాయి. ఏకంగా రూ. 31. 80 లక్షల వర్క్స్ ఉత్తర్వులను ఇలా నకిలీవి సృష్టించడం అనేక అనుమానాలకు తావిస్తోంది. డీఈఓ వరలక్ష్మి రాక ముందు వరకూ జిల్లా విద్యాశాఖాధికారిగా ప్రస్తుతం సమగ్రశిక్ష ఏపీసీగా పనిచేస్తున్న నాగరాజు వ్యవహరించారు. అయితే ఆయన ఉన్నప్పుడు ఆయనకు తెలియకుండా డిసెంబరు 15వ తేదీన ఈ నకిలీ వర్క్ ఉత్తర్వులు సృష్టించారా....? లేక ప్రస్తుత డీఈఓ వచ్చాక చేశారా..? అన్నది తెలియాల్సి ఉంది. మొత్తంగా ఏకంగా 31.80 లక్షల వర్కులకు సంబంధించి ఉన్నతాధికారులకు తెలియకుండా ఈ బాగోతాన్ని నడిపినట్టు స్పష్టమవుతోంది. అయితే డీసీఈబీలో ఈ స్కాంతో పాటు, ఇతర పనుల కోసం కూడా పెద్ద ఎత్తున ఫీజుల డబ్బులను భారీగానే గోల్‌మాల్ సాగినట్టు తెలుస్తోంది. జిల్లా కలెక్టర్ లేదా, విద్యాశాఖ కమిషనర్ విచారణ చేయిస్తే...ఈ నకిలీ ఉత్తర్వులు సృష్టించిన అక్రమాలుతోపాటు, వారి అక్రమాలు కూడా వెలుగుచూసే అవకాశం ఉంది.

పశువుల సంత ఆదాయం రూ.3.24లక్షలు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 8: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువులసంతతో మార్కెట్‌కు రూ.3,24,610 ఆదాయం వచ్చినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మీ ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.1,89,410, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,35,200 వచ్చిందని తెలిపారు.

టమోటా కిలో రూ.23

అనంతపురంరూరల్, సెప్టెంబరు 8: కక్కలపల్లి ట మోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.23తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. ఆదివారం 3వేల టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.16, కనిష్ఠ ధర రూ.10పలికినట్లు ఆయన తెలిపారు.

జీడిపల్లికి 1026 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 8: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఆదివారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 1026 క్యూసెక్కులుగా ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో ఫేజ్-2కు 932 క్యూసెక్కులు, మరువ నుంచి 54 క్యూసెక్కులు వెళ్తున్నట్లు వెల్లడించారు.

నేటి నుంచి ఐసెట్ వెబ్ ఆప్షన్లు

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 8: ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలు పొందేందుకు సోమవారం నుంచి ద్వితీయ కౌన్సెలింగ్ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇప్పటికే ప్రథమ కౌన్సెలింగ్ పూర్తి అయింది. అయితే మిగిలిన సీట్లను భర్తీచేసేందుకు ద్వితీయ కౌన్సెలింగ్ ద్వారా 4 నుంచి రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేపట్టింది. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు, ప్రథమ కౌన్సెలింగ్ ద్వారా నచ్చిన కళాశాలలు దక్కని విద్యార్థులు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. ఈ ప్రక్రియ పూర్తిచేసుకున్న విద్యార్థులకు 17న సీట్లు కేటాయించనున్నారు.

విజయవాడకు తరలిన అనంత ఉద్యోగులు

అనంపురం టౌన్, సెప్టెంబరు 8: వరద సహాయక చర్యలు చేపట్టడానికి జిల్లా నుంచి పలువురు ఉద్యోగులు విజయవాడ తరలివెళ్లారు. 19 మంది తహసీల్దార్లు, 60మంది డిప్యూటీ తహసీల్దార్లు, 60 మంది సీనియర్ అసిస్టెంట్లు, 20మంది రీసర్వే డీటీలను వరద సహాయక చర్యల విధులకు నియమించారు. ఆ మేరకు రెవెన్యూశాఖ అదికారులు, ఉద్యోగులు శనివారం రాత్రి ప్రత్యేక వాహనాల్లో విజయవాడకు బయలుదేరి వెళ్లారని డీఆర్ఓ రామకృష్ణారెడ్డి తెలిపారు.

రాయచూరు ప్యాసింజరు రెండు రోజులు రద్దు

గుంతకల్లు, సెప్టెంబరు 8: నిర్వహణ కారణాల వల్ల గుంతకల్లు-రాయచూరు డెము ప్యాసింజరు (నెం. 07799/07800) రైలును రెండు రోజులపాటు రద్దు చేసినట్లు రైల్వే అధికారులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. గుంతకల్లు-రాయచూరు (07799) డెము ప్యాసింజరును ఈ నెల 9, 10 తేదీల్లో, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 07800)ను 10, 11 తేదీల్లో రద్దుచేసినట్లు అధికారులు తెలియజేశారు. ప్రయాణికులు గమనించాలని కోరారు.

సిద్దేశ్వరంతోనే రాయలసీమకు సాగునీరు

సిద్దేశ్వరం సీమపాట ఆవిష్కరణ సభలో వక్తలు



సీడీని ఆవిష్కరిస్తున్న సాహితీకారులు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 8: సిద్దేశ్వర ప్రాజెక్టు నిర్మాణంతోనే రాయలసీమ ప్రాంతానికి సాగు, తాగునీరు లభిస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాల్‌లో జలసాధన సమితి, రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ సంయుక్తాధ్వర్యంలో ప్రజాగాయకుడు డాక్టర్ సిగిలిరేవు రామాంజనేయులు రచించి, పాడిన 'సిద్దేశ్వరం' రాయలసీమ పాట ఆవిష్కరణ సభ నిర్వహించారు. జలవనరులశాఖ రిటైర్డ్ ఇంజనీర్ పాణ్యం సుబ్రహ్మణ్యంస్వామి.. సిద్దేశ్వరం పాట సీడీని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ... సీమ ప్రజలకు సాగునీటి అవసరాలు, ప్రభుత్వ విధానాలపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి సదస్సులు మరెన్నో జరగాలన్నారు. సీమ ప్రజా సంకల్పాన్ని ఏకతాటిపైకి తీసుకొచ్చి, సిద్దేశ్వరం ప్రాజెక్టును నిర్మించేలా ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. అనంతరం కళాకారులు జానపద గేయాలతో అలరించారు. కార్యక్రమంలో రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ అధ్యక్షుడు తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి, జలసాధన సమితి అధ్యక్షుడు రామ్‌కుమార్, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకుడు ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణ స్వామి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్, డాక్టర్ శ్రీధర్ రెడ్డి, మానవ హక్కుల వేదిక బాషా, డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, జెన్నె ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా సీనియర్ జట్టుకు వినయ్‌కుమార్

కోచ్‌గా ప్రసాద్‌రెడ్డి



వినయ్‌కుమార్



ప్రసాద్‌రెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 8: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సీనియర్ జట్టుకు జిల్లాకు చెందిన ప్లేయర్ వినయ్‌కుమార్ సెలెక్ట్ అయ్యాడు. ఈనెల 9వతేదీ నుంచి 27వతేదీ వరకు బెంగుళూరులో కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ స్థాయి క్రికెట్ టోర్నీకి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర జట్టు తరఫున వినయ్‌కుమార్ ప్రాతినిధ్యం వహిస్తాడు. జిల్లాకు చెందిన సీనియర్ ప్లేయర్, మాజీ రంజీ ఆటగాడు ఆర్ఎస్ ప్రసాద్‌రెడ్డి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సీనియర్ రాష్ట్ర జట్టుకు కోచ్‌గా నియమితులయ్యారు. వినయ్‌కుమార్, ప్రసాద్‌రెడ్డిలకు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి అభినందనలు తెలిపారు.

ఉల్లి ధరహాసం

- కిలో రూ.80
- వెల్లుల్లి రూ.350
- దిగుబడి తగ్గడంతో పెరుగుతున్న ధరలు

కదిరి అర్బన్, సెప్టెంబరు 8 : మార్కెట్లో ఉల్లి, వెల్లుల్లి ధరలు భారీగా పెరిగాయి. కేజీ ఉల్లి రూ.80 చేరడంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే తరహాలో వెల్లుల్లి ధర కూడా కిలో రూ.350కు చేరుకుంది. సాగు తగ్గడం... ఇతర ప్రాంతాల నుంచి సరుకు దిగుమతి తగ్గడంతో వీటి ధరలు వీపరీతంగా పెరిగాయని వ్యాపారలు అంటున్నారు. మూడు నెలల క్రితం రూ. 20 పలికిన ఉల్లి... నేడు రూ. 80కి చేరింది.

తగ్గిన దిగుబడి

ఉల్లిగడ్డలు మహారాష్ట్రంలో ఎక్కువగా పడుతాయి. అయితే వర్షాల కారణంగా దిగుబడి తగ్గడంతో ఆ ప్రభావం ధరలపై చూపుతోంది. రవాణా ఖర్చులు పెరగడంతో ఉల్లి ధరలు భారీగా పెరుగుతున్నాయి. వర్షాల కారణంగా అక్కడే డిమాండ్ పెరగడంతో మన రాష్టానికి ఉల్లి గడ్డల దిగుబడి తగ్గింది. క్రమంగా ధరలు పెరుగుతుండడంతో సామాన్యులు కొనుగోలు చేయాలంటేనే భయపడాల్సిన దుస్థితి నెలకుంది.

పెరిగిన కష్టాలు :

పెరిగిన ఉల్లి ధరలు గృహిణులకు, హోటల్స్ నిర్వాహకులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఉల్లి, వెల్లుల్లి లేకుండా ఏ కూరలు చేయలేం. శుభకార్యక్రమాలకు పెద్ద మొత్తంలో వీటి అవసరం రావడంతో అధిక ఖర్చు అవుతున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. పాఠశాలు, హాస్టల్‌ల్లో భోజన పథకానికి ఎక్కువ మొత్తంలో వినియోగిస్తున్నారు. రానున్న రోజుల్లో మరింత ధరలు పెరిగే అవకాశముందని వ్యాపారలు అంటున్నారు. కొత్త పంట అందుబాటులోకి వచ్చేవరకు ధరలు ఇలాగే పెరుగుతూ ఉంటాయని అంటున్నారు. మార్కెట్‌లో కిలో వెల్లుల్లి రూ.350 పలుకుతోంది. మొదటి రకం కిలో రూ.400 పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు.



కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న ఉల్లి, వెల్లుల్లి దుకాణాలు

ఆచితూచి కొనాల్సి వస్తోంది

రోజురోజుకు ఉల్లి, వెల్లుల్లి ధరలు పెరుగుతున్నాయి. నెలక్రితం వరకు ఉల్లి ధర రూ. 30 నుంచి 40 వరకు ఉండేది. ఇప్పుడు రూ.80 పెట్టాల్సి వస్తోంది. ధరలకు భయపడి పావు కిలో కొంటున్నాం. ఇలాగే ధరలు కొనసాగితే మునుముందు సామాన్యులకు ఇబ్బందులు తప్పవు.

- వరలక్ష్మి, గృహిణి

మరింత పెరుగుతాయ్

మహారాష్ట్రంలో వర్షాలు కారణంగా ఉల్లి దిగుబడి తగ్గిపోయింది. మార్కెట్ ధరలను బట్టి విక్రయిస్తున్నాం. హోల్‌సెల్ మార్కెట్‌లో రోజురోజుకు ధరలు పెరుగుతున్నాయి. గత యేడాది ఉల్లికి ధరలు లేకపోవడంతో రైతులు ఉల్లిని ఈ యేడాది సాగుచేయలేదు. ధరలు పెరగడంతో వ్యాపారాలు తగ్గాయి. వినియోగదారులు కొనుగోలు చేయకపోతే ఉల్లి కుళ్లిపోయే అవకాశముంది.

- రియాజ్‌ఖాన్, వ్యాపారి

వినాయక సందడి

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్: వినాయక చవితి పండుగలను జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లాకేంద్రం, మండల కేంద్రాలు, గ్రామాల్లో వాడవాడలా గణనాథుల విగ్రహాలను ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ధర్మవరం కురుబ వీధిలో భవన నిర్మాణ కార్మికుడిగా...



ధర్మవరం తేరుబజారులో ఎర్రకోట వినాయకుడు



కదిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద..



ధర్మవరం ఆర్యవైశ్య కొత్తసత్రంలో నాగపడగపై..




ముదిగుబ్బలోని అనంతపురం రోడ్డులో..



పుట్టపర్తిలో నటరాజ్ ఆకారంలో...



బత్తలపల్లిలో...



తనకల్లు ఇందిరానగర్‌లో...



ఓడీసీలో పీర్లచావిడి వద్ద...



కొత్తచెరువులో...



బుక్కపట్నంలోని శివాలయంలో..



గుట్టకిందపల్లిలో నెమలి, వీణపై..



జిల్లా పోలీసు కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాసరావు పూజలు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



గంగాద్రి (ఫైల్)

నల్లమాడ, సెప్టెంబరు 8: తనకల్లు మండలంలో ఈనెల 3వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని దొన్నికోట గ్రామానికి చెందిన గంగాద్రి (40) శనివారం మరణించాడు. గంగాద్రి బతుకుదెరువు కోసం అన్నమయ్య జిల్లా ములకలచెరువులోని ఓ టమోట మండిలో పనిచేయడానికి వెళ్లాడు. ఈ నెల 3న ఆయనతో మరో 29 మంది ప్రయాణిస్తున్న బోలెరో వాహనం లారీని ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నల్లమాడ మండలానికి చెందిన శంకరప్ప అక్కడికక్కడే మరణించగా.. మిగిలిన వారు తీవ్రంగా గాయపడి వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. తీవ్రంగా గాయపడిన గంగాద్రిని మొదట కదిరికి, ఆ తరువాత అనంతపురం, తరువాత కర్నూలుకు తరలించారు. నాలుగు రోజుల పాటు చికిత్స పొందారు. కోలుకోలేక శనివారం అయన మరణించాడు. ఆయన భార్య లక్ష్మీదేవి కూడా తీవ్రంగా గాయపడి అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి గంగాద్రి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు.

అనుమానాస్పదంగా వ్యక్తి...



మల్లికార్జున (ఫైల్)

ధర్మవరంరూరల్ : మండలంలోని గొల్లపల్లిక్రాస్ సమీపంలో చెన్నేకొత్తపల్లి మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన బోగిన మల్లికార్జున (35) అనుమానాస్పద స్థితిలో మరణించాడు. కనగానపల్లి మండలం వేపకుంటకు చెందిన మల్లికార్జున చెన్నేకొత్తపల్లి మండలం వెల్దుర్తిలో నివాసముంటున్నాడు. అనంతపురంలోని ఓ ప్రైవేటు కంపెనీ షాపులో పనిచేస్తున్నాడు. వెల్దుర్తి నుంచి అనంతపురం వెళ్లే మార్గమధ్యలో రోడ్డు పక్కన అతని మృతదేహం పడి ఉండటాన్ని గొర్రెల కాపరులు ఆదివారం గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ శ్రీనివాసులు, రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్ఐ నరేంద్ర సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతను మూడు రోజుల క్రితమే మరణించి ఉంటాడని, కేసు దర్యాప్తులో ఉందని పోలీసులు తెలిపారు. మల్లికార్జునకు భార్య శ్వేత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా మృతుడు రోడ్డుప్రమాదంలో మృతిచెందాడా.. ఏదైనా కారణంతో మరణించాడా... అన్నది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

ధర్మవరాన్ని సస్యశ్యామలం చేస్తాం

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్



దాదులూరు చెక్‌డ్యాంను పరిశీలిస్తున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం(కనగానపల్లి), సెప్టెంబరు 8 : ధర్మవరం నియోజకవర్గంలోని చెరువులకు హంద్రీనీవా నీటిని తీసుకొచ్చి సస్యశ్యామలం చేస్తామని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. ఆదివారం కనగానపల్లి మండలంలోని దాదులూరు వద్ద ఉన్న చెక్‌డ్యాంను పరిశీలించిన ఆయన మాట్లాడారు. ఈ ఏడాది హంద్రీనీవా ద్వారా నీరు సంవృద్ధిగా వస్తున్న నేపథ్యంలో ధర్మవరం నియోజకవర్గంలోని చెరువులకు నీరందించే విషయంపై దృష్టిసారించామన్నారు. ఇందులో భాగంగా దాదులూరు చెక్‌డ్యాంను పరిశీలించామన్నారు. కుంటిమద్దిచెరువుకు ఇప్పటికే హంద్రీనీవా నీరు అందే అవకాశం ఉన్న నేపథ్యంలో అక్కడి నుంచి గంతిమర్రికి నీరు వస్తాయని అన్నారు. గంతిమర్రి చెరువు నుంచి దాదులూరు చెక్‌డ్యాంకు, అక్కడి నుంచి రేగాటిపల్లి, పోతుకుంట, గొట్లూరు, అప్రాచెరువులకు నీరు చేరుతుందన్నారు. హంద్రీనీవా నీటి సరఫరాకు నియోజకవర్గంలో ఎక్కడ అడ్డంకులు లేకుండా చూస్తామన్నారు. ఐదేళ్లలో నీరు వచ్చినా దానిని వినియోగించడంలో విఫలమయ్యారన్నారు. ఈ సారి అలాంటి పరిస్థితి లేకుండా హంద్రీనీవా ద్వారా వీలైనంత ఎక్కువ నీటిని ధర్మవరం నియోజకవర్గానికి తీసుకుంటామని, ఈ ప్రాంత రైతులకు నీరందించడమే తమ లక్ష్యమని అన్నారు. ఆయన వెంట జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, ధర్మవరం నియోజకవర్గ క్లస్టర్ టీడీపీ ఇన్‌చార్జ్ చింతలపల్లి మహేశ్ చౌదరి, నాయకులు విజయసారథి చౌదరి, రేగాటిపల్లి నాగేంద్రరెడ్డి, విజయ్‌చౌదరి, సుధాకర్‌నాయుడు, పోతుకుంట మధు ఉన్నారు.

వినాయకుడికి తాగునీటి కార్మికుల వినతి

ముదిగుబ్బ, సెప్టెంబరు 8: శ్రీసత్యసాయి తాగునీటి కార్మికులకు జీతాలు చెల్లించాలని మండల కేంద్రంలోని వినాయకుడి విగ్రహానికి సీపీఐ ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. ఆరు నెలలు బకాయిపడ్డ జీతాలు చెల్లించాలని, మండలంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

పుట్టపర్తి: స్థానిక హనుమాన్ కూడలిలో ఒంటికాలుపై నిలబడి సత్యసాయి వాటర్ ప్రాజెక్టు కార్మికులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మురళి, బాలు, ఆదినారాయణ, లక్ష్మినారాయణ, శ్రీనివాసులు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.





ముదిగుబ్బలో వినాయకుడికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు, కార్మికులు, పుట్టపర్తిలో ఒంటికాలిపై నిలబడి నిరసన

దళవాయి శివమ్మకు సన్మానం



దళవాయి శివమ్మను సన్మానిస్తున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరంరూరల్: హస్తకళల విభాగంలో ఇటీవల జాతీయ స్థాయి అవార్డు అందుకున్న మండలంలోని నిమ్మలకుంట గ్రామానికి చెందిన తోలుబొమ్మల కళాకారుని దళవాయి శివమ్మను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ఆ గ్రామానికి వెళ్లి ఆదివారం ఘనంగా సన్మానించారు. శివమ్మను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. తోలుపై శివమ్మ వేసిన శ్రీకృష్ణచరిత పెయింటింగ్, విశ్వరూప హనుమాన్ తోలుబొమ్మ అద్భుతంగా ఉందన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు చిలకం మధుసూదన్‌రెడ్డి, మాజీ జడ్పీచైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి, చింతలపల్లి మహేష్‌చౌదరి, మాజీ జడ్పీటీసీ మేకలరామాంజినేయులు, నిమ్మలకుంట కుళ్లాయప్ప, విజయసారథి, చిగిచెర్లరాఘవరెడ్డి, జంగంనరసింహులు, గొట్లూరు శివయ్య పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

ముదిగుబ్బ: మండలంలోని మలకవేముల క్రాస్‌లో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని శనివారం స్వాధీనం చేసుకున్నట్లు ముదిగుబ్బ రూరల్ సీఐ శ్యామ్ రావు తెలిపారు. ఎనుములవారిపల్లికి చెందిన వ్యక్తి నుంచి రూ. 5,110 విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వరద బాధితులకు దుప్పట్ల పంపిణీ

ధర్మవరం, సెప్టెంబరు 8: విజయవాడలోని వరద బాధితులకు మూడు వేల దుప్పట్లను మంత్రి సత్యకుమార్‌యాదవ్ చేతుల మీదుగా ఆదివారం అందజేసినట్లు ధర్మవరానికి చెందిన స్పందన ఆస్పత్రి వైద్యులు సోనియా, బషీర్ తెలిపారు. అనంతరం ఐటీ శాఖ మంత్రి నారాలోకేశ్‌ను కలిశామని, వర్షాలు తగ్గిన తరువాత వరద బాధితులకు వైద్య సేవల కోసం సహకారం తీసుకుంటామని, అందుకు సిద్ధంగా ఉండాలని ఆయన సూచించినట్లు వారు తెలిపారు.



వరద బాధితులకు దుప్పట్లు అందజేస్తున్న మంత్రి

గణేశ్ నిమజ్జనానికి ఏర్పాట్ల పరిశీలన

ధర్మవరం, సెప్టెంబరు 8: ధర్మవరంలో గణేశ్ నిమజ్జనాన్ని చేసే చెరువు ప్రాంతాన్ని డీఎస్పీ శ్రీనివాసులు, వన్‌టౌన్, టూటౌన్ సీఐలు నాగేంద్రప్రసాద్, రెడ్డప్ప, బీజేపీ నాయకులు ఆదివారం పరిశీలించారు. విగ్రహాలను తీసుకెళ్లే రోడ్డులో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని, విగ్రహాలు వెళ్లే మార్గంలో విద్యుత్ తీగలు తగల కుండా అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులకు సూచించారు. నిమజ్జనం రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా చర్యలు చేపట్టాలని డీఎస్పీ సీఐలకు సూచించారు. నిమజ్జనం చేసే చోట చిన్నపిల్లలను వెంట తీసుకు రాకూడదన్నారు.

గేదె ప్రాణాలు కాపాడిన వైద్యులు

కొత్తచెరువు, సెప్టెంబరు 8: మండలంలోని తలమర్ల గ్రామానికి చెందిన పాడిరైతు చంద్రాయుడు గేదెకు సిజేరియన్ చేసి పశువైద్యులు ఉదయ్‌కుమార్, శివకుమార్ శనివారం ప్రాణాలను కాపాడారు. గేదె గర్భంలో దూడ అడ్డం తిరగడంతో ఈన లేక రెండు రోజుల నుంచి తీవ్ర ఇబ్బందులకు గురైంది. ఈ విషయాన్ని పాడిరైతు చంద్రాయుడు పశువైద్యులు ఉదయ్ కుమార్‌కు సమాచారం అందించడంతో ఆయన వినాయక చవితి పండగ నేపథ్యంలో సెలవు అయినా.. తోటి డాక్టర్ శివ కుమార్ సహకారంతో గేదెకు సిజేరియన్ చేసి... చనిపోయిన దూడను వెలికి తీసి గేదె ప్రాణాలను కాపాడారు. ఈ కార్యక్ర మంలో పశు వైద్య సిబ్బంది రాజు, తలమర్ల అనిమల్ హజ్‌మెంద్రీ అసిస్టెంట్‌లు సునీత, వరదరాజులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

టీడీపీలోకి పలువురి చేరిక

కొత్తచెరువు, సెప్టెంబరు 8: మండలంలోని కేశాపురం గ్రామానికి పలువురు వైసీపీ నాయకులు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలోకి ఆదివారం చేరారు. ఈ మేరకు ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి వారికి కండవాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చంద్రబాబు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను చూసి వైసీపీని వీడి టీడీపీలోకి చేరామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్షరాస్యత దినోత్సవం

కదిరి,సెప్టెంబరు 8: అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా స్థానిక గిరిజన గురుకుల పాఠశాలలో మహిళ సంఘ సభ్యులకు అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కదిరి ఎంఈఓ ఓబులరెడ్డి మాట్లాడుతూ.. మహిళలకు అక్షరాస్యత వల్ల ఆర్థిక స్వాతంత్రం కలుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఓడీసీ ఎంఈఓ రమణ, పాఠశాల ప్రిన్సిపాల్ మురళి, న్యాయవాది సురేంద్రచౌదరి తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 8: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు మంగళవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ హరీష్‌బాబు, ఏపీఎస్ఎస్‌డీసీ అధికారి అబ్దుల్ ఖయ్యూం ప్రకటనలో పేర్కొన్నాడు. 10వ తేదీ ఉదయం నాలుగు కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, డిప్లమా, పూర్తి చేసి 18 నుంచి 35 సంవత్సరాలు లోపు వయసు కలిగి ఉండాలన్నారు. అర్హతను బట్టి రూ. 12వేల నుంచి రూ. 20 వేల వరకు జీతం ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులు అనంతపురం, బెంగళూరు, హైదరాబాద్‌లో ఉద్యోగాలు చేయవలసి ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ ఆధార్‌కార్డు, విద్యార్హత పత్రాలు జిరాక్స్ కాపీలతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. వివరాలకు 9966682246ను సంప్రదించాలన్నారు.

ఆలిండియా సైకిల్ యాత్ర

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 8 : కోల్‌కతాలో దారుణంగా హత్యకు గురైన జూనియర్ వైద్యురాలికి న్యాయం జరగాలని కోరుకుంటూ ఓ యువకుడు ఆల్‌ఇండియా సైకిల్‌యాత్రను చేపట్టాడు. సైకిల్ యాత్ర శనివారం పెనుకొండకు చేరుకుంది. కాకినాడకు చెందిన వంశీ అనే యువకుడు సైకిల్‌లో ఆల్ ఇండియా యాత్ర చేపట్టినట్లు తెలిపాడు. ఎన్ఎహెచ్ఆర్‌సీ ఎన్‌డీటీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ హరిలాల్‌నాయక్, సౌత్ ఇండియా కౌన్సిలర్ రంజిత్‌నాయక్ యువకుడిని అభినందించారు.

25 నుంచి చెకుముకి టాలెంట్ టెస్ట్

పెనుకొండ, సెప్టెంబరు 8 : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 25నుంచి చెకుముకి లాటెంట్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి హరితెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్‌పట్ల అభిరుచి పెంచడానికి సైన్స్ సంబరాలను విద్యాశాఖ విద్యాశాఖ ప్రోత్సహిస్తుందన్నారు. గత 34సంవత్సరాలుగా ఉపాధ్యాయ, వివిధ సంస్థ సహకారంతో జనవిజ్ఞాన వేదిక టాలెంట్ టెస్టులు నిర్వహిస్తుందన్నారు. ఈనెల 25న పాఠశాల స్థాయిలో అక్టోబరు 27న జిల్లాస్థాయి, నవంబరు 9, 10న రాష్ట్ర స్థాయిలో టాలెంట్ టెస్టులు నిర్వహిస్తామన్నారు.

కియలో అనంత నిరుద్యోగులకు అవకాశం ఇవ్వండి

పెనుకొండ రూరల్ : కియ పరిశ్రమలో స్థానికంగా నిరుద్యోగ యువతీయువకులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ.. కంపెనీ ప్రతినిధులను కోరారు. శనివారం పెనుకొండ సమీపంలోని కియ కార్లపరిశ్రమను ఆయన సందర్శించారు. ఆయన ప్రతినిధులతో కంపెనీ ఉత్పత్తులపై ఆరాతీశారు. కరువుకు నిలయమైన అనంతపురం నిరుద్యోగులకు కంపెనీ అండగా నిలవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడ్డ గంగాధర్

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 8: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడ్డాడు. సోమందేపల్లి మండల పరిధిలోని నల్లగొండ్రాయనపల్లి సమీపంలో ఆదివారం జాతీయ రహదారిపై వైజంక్షన్ వద్ద ద్విచక్రవాహనం బోల్తాపడి చిన్నబాబయ్యపల్లికి చెందిన గంగాధర్(34) తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల మేరకు చిన్నబాబయ్యపల్లి గంగాధర్‌పని నిమిత్తం సోమందేపల్లికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. వైజంక్షన్ వద్ద అదుపుతప్పి బైక్ బోల్తాపడటంతో తీవ్రంగా గాయపడ్డాడన్నారు. గాయపడిన అతన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తలరించినట్లు తెలిపారు. పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు. మద్యం మత్తులో ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు.

మద్యం స్వాధీనం



మద్యాన్ని చూపుతున్న పోలీసులు

హిందూపురం(పరిగి), సెప్టెంబరు 8: అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్నట్లు ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని 206టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపారు. శీగుపల్లి, -వంగలపల్లి రహదారిలో ద్విచక్రవాహనంలో మ ద్యం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడిచేసి పట్టుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా మండల పరిధిలోని పెన్నానది నుండి అక్రమంగా తరలిస్తున్న కొల్లకుంట గ్రామానికి చెందిన ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.

హిందూపురం(సోమందేపల్లి) : అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. సోమందేపల్లి మండల పరిధిలోని మంచేపల్లి గ్రామంలో కర్ణాటక మద్యం అమ్ముతున్న నాసిర్‌అహ్మద్‌ను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 192కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చే సినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

కొండపై నుంచి జారిపడి వ్యక్తి మృతి

మడకశిరటౌన్, సెప్టెంబరు 8: పట్టణంలోని శివపురంకు చెందిన మంజునాథ్ (45) ఆదివారం కొండపై నుంచి జారిపడి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మంజునాథ్‌కు మతిస్థిమితం లేదు. మూడు రోజుల క్రితం అదృశ్యయినట్లు స్థానికులు తెలిపారు. ఆదివారం కొండపై నుంచి జారిపడి మృతి చెందారు. ఇతనికి భార్య ఉంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

జూదరుల అరెస్ట్

రొళ్ల, సెప్టెంబరు 8 : పేకాట స్థావలరాలపై దాడి చేసిన పోలీసులు జూదరులను అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని సీఎం గట్ట గ్రామంలో సీఐ రాజ్‌కుమార్ , ఎస్ఐ రాజ్‌శేఖర్ తమ సిబ్బందితో పేకాట స్థావరాలపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. రూ.78,450 నగదు, 5 సెల్‌ఫోన్లు, 7 బైకులు స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

ఆటో బోల్తా.. ఒకరికి గాయాలు

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 8 : ఆటో బోల్తా పడి ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు శనివారం రొద్దం మండలంలోని కంచిసముద్రం వద్ద ఆటోబోల్తాపడి శ్రీరామ్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడగా మరో ఐదుగురు గాయపడ్డారు. రాచూరు గ్రామానికి చెందిన శ్రీరాములు బెంగళూరుకు వెళ్లి ఎల్‌జీబీనగర్‌వద్ద దిగారు. అక్కడి నుంచి స్వగ్రామానికి వెళ్లేందుకు ఆటో ఎక్కాడు. కంచిసముద్రం వద్దకు వెళ్లగానే ఆటో ప్రమాదవశాత్తు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న శ్రీరాములుకు కాళ్లు విరిగాయి. మిగిలిన వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. బాధితులను స్థానికులు హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు విచారణ చేపట్టారు.

రేపటి నుంచి ఉలవ విత్తనాల పంపిణీ

మడకశిర,సెప్టెంబరు 8 : ఉలవతి విత్తనాలు 80శాతం సబ్సీడీతో ఈ నెల 10 నుంచి సబ్సీడీతో పంపిణీ చేస్తామని వ్యవసాయ శాఖ అధికారి తిమ్మప్ప తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల కారణంగా వేరుశనగ సాగు చేయని రైతులకు ప్రత్యామ్నాయ పంటగా ఉలవలు సరఫరా చేస్తామన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు 1300 క్వింటాళ్ల ఉలవ విత్తనాలను కేటాయించారు. మడకశిర మండలానికి 300 క్వింటాళ్ళు, అమరాపురం మండాలనికి 400 కింటాళ్ళు, గుడిబండ మండలానికి 300 కింటాళ్ళు, రొళ్ళ మండలానికి 90 క్వింటాళ్లు అగలి మండాలనికి 210 క్వింటాళ్ళ ఉలవ విత్తనాల ను కేటాయించారన్నారు. 10కేజీల ఉలవ విత్తనాల ఫాకెట్ పూర్తి ధర రూ. 870 అందులో 80శాతం సబ్సీడి రూ.696 పోను రైతు రూ. 174 లు చెల్లించాల్సి ఉందన్నారు. మంగళవారం నుంచి పంపిణీ ప్రారంభిస్తామన్నారు.

25 నుంచి చెకుముకి టాలెంట్ టెస్ట్

పెనుకొండ, సెప్టెంబరు 8: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 25నుంచి చెకుముకి లాటెంట్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి హరితెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్‌పట్ల అభిరుచి పెంచడానికి సైన్స్ సంబరాలను విద్యాశాఖ విద్యాశాఖ ప్రోత్సహిస్తుందన్నారు. గత 34సంవత్సరాలుగా ఉపాధ్యాయ, వివిధ సంస్థ సహకారంతో జనవిజ్ఞాన వేదిక టాలెంట్ టెస్ట్‌లు నిర్వహిస్తుందన్నారు. ఈనెల 25న పాఠశాల స్థాయిలో అక్టోబరు 27న జిల్లాస్థాయి, నవంబరు 9, 10న రాష్ట్రస్థాయిలో టాలెంట్ టెస్ట్‌లు నిర్వహిస్తామన్నారు. అనంతరం ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి హరి, జోన్ అధ్యక్షులు నవీన్, ఘనగిరి పాఠశాల కరస్పాండెంట్ ఇలియాజ్, కమిటీ సభ్యులు రాజశేఖర్, బాబు, హనుమంతనాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్సులో స్థానం

పెనుకొండ, సెప్టెంబరు 8 : ఉపాధ్యాయుడు, కవి, రచయిత, సామాజిక సేవా సంస్కర్త జాబిలి చాంద్‌బాషకు వరల్డ్ బుక్‌ఆఫ్ రికార్డ్సులో స్థానం దక్కినట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 22సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో అనేక సేవలు చేస్తూ విద్యార్థులను వ్యక్తిగతంగా సామాజికంగా ఉత్తమ భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతు న్నానన్నారు. సేవా కార్యక్రమాలు గుర్తించిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో వీరు నమోదైనట్లు మెయిల్ ద్వారా సమాచారం పంపారన్నారు.

నేడు మహాగణపతి వార్షిక కల్యాణోత్సవం

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 8: పట్టణ పరిధిలోని నానెప్పనగర్‌లో బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వల్లభ గణపతి సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం శ్రీ సిద్ధి, బుద్ధి సమేత శ్రీ మహాగణపతి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. సాయంత్రం 6.30 గంటలకు వార్షిక కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వహకుడు సునీల్ శర్మ తెలిపారు. అదే విధంగా 12వతేదీ గురువారం ఉదయం 10.30 గంటలకు శ్రీ మహాగణపతి హోమం, శుక్రవారం 13వ తేదీ నిమజ్జక కార్యక్రమం ఉంటుందన్నారు.

ఎరువు..బరువు..!



బోర్ల కింద సాగు చేసిన మొక్కజొన్న పంట



● ఎరువుల కొరతతో రైతులకు తప్పని ఇబ్బందులు
● అధిక ధరలతో భారం పడుతోందని ఆవేదన

మడకశిర రూరల్, సెప్టెంబరు 8: అన్నదాతకు ఎరువుల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. రైతు సేవా కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 18 రైతుసేవా కేంద్రాలు ఉన్నాయి. వాటిలో ప్రస్తుతం రైతుల డిమాండ్‌కు తగినంతగా ఎరువులు దొరకడం లేదు. ప్రస్తుతం ఎక్కువ మంది రైతులు వ్యవసాబోర్లు, బావుల కింద మొక్కజొన్న, మిరప, కంది పంటలు అధికంగా సాగు చేశారు. దీంతో యూరియా కాంప్లెక్స్ ఎరువులకు డిమాండ్ పెరిగి పోయింది. డిమాండ్‌కు తగినట్లుగా ఎరువులు దొరకకపోవడంతో ప్రైవేట్ దుకాణాలపై ఆధారపడుతున్నారు. అక్కడ అధిక ధరలతో కొనలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదనుగా భావిస్తున్న కొందరు వ్యాపారులు ఎరువుల ధరలు అమాంతం పెంచేశారు. అసలే పెరిగిన ధరలతో రైతులు విలవిలలాడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఎరువులను రైతు సేవా కేంద్రల్లో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

అధిక ధరలు తప్పడం లేదు:
వెంకటరంగారెడ్డి, రైతు



రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు లేకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో పట్టణాలకు వెళ్ళి అధిక ధరలతో కోనుగోలు చేస్తున్నాం. యూరియా బస్తా రైతు సేవా కేంద్రంలో రూ.270 కాగా మార్కెట్‌లో రూ.320 తో కోనుగోలు చేస్తున్నారు. పట్టణం నుంచి ఆటో చార్జీ రూ.40 తప్పడం లేదు. బస్తా యూరియా మొత్తం రూ.360 అవుతోంది. అధికారులు స్పందించి డిమాండ్‌కు తగినట్లుగా ఎరువులు సరఫరా చేయాలి

ఇండెంట్ పంపాం:
తిమ్మప్ప, ఏఓ, మడకశిర

రైతులకు కాలసినంత ఎరువులు అందిస్తున్నాం. కొరత ఉన్న ప్రాంతాలకు ఇండెంట్ పంపాం. స్టాక్ రాగానే రైతులకు కాలసినంత ఎరువు పంపిణీచేస్తాం.

ఉపాధి కూలీ మృతి



శివన్న మృతదేహం

మడకశిర(అమరాపురం), సెప్టెంబరు 8: అస్వస్థతకు గురైన ఉపాధి కూలీ మృత్యువాత పడ్డారు. మండలంలోని బసవనపల్లి పంచాయతీ కరిదాసన హట్టి గ్రామంలో ఆదివారం ఉపాధి హామీ పని నిమిత్తం శివన్న పొలంలో పని చేస్తున్నారు. పంటతోటల పెంపకానికి గుంతలు తవ్వుతుండగా ఒక్కసారిగా స్పృహ తప్పి పడిపోయాడు. ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు తక్షణమే స్పందించి నీళ్లు తాగించాడు. ప్రథమ చికిత్స నిమిత్తం మడకశిర ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే చనిపోయాడు. ఇతనికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఇంటికి పెద్దదిక్కు కోల్పోయామని భార్య అక్కమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వం స్పందించి, కుటుంబాన్ని ఆదుకోవాలని ఆమె వేడుకొంది.

డెయిరీ భవనం కూల్చివేత



కూల్చేసిన భవనం

హిందూపురం, సెప్టెంబరు 8 : పట్టణంలోని పేట వెంకటరమణ స్వామి వీధిలో ఉన్న పాలడెయిరీ భవనాన్ని శుక్రవారం రాత్రి కూల్చివేశారు. సడ్లపల్లి, పోచనపల్లి, సూగూరు గ్రామానికి చెందిన కొంతమంది పాడిరైతులు పాలడెయిరీని ఏర్పాటు చేసుకున్నారు. రెండు దశాబ్దాల క్రితం డెయిరీ మూతబడింది. ఆ పక్కనే బసవన్నగుడి ఉంది. కొంతకాలంగా నిరుపయోగంగా ఉన్న పాలడెయిరీ స్థలాన్ని ఇవ్వాలని లింగాయత్ కులస్థులు ప్రజాప్రతినిధులను కోరుతూ వచ్చారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆ స్థలాన్ని అప్పగించాలని లింగాయత్ కులస్థులు ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణిని కోరారు. అంతలోనే భవనం కూల్చేయడం చర్చనీయాంశంగా మారింది. ఎవరు కూల్చివేశారనేది తెలియాల్సి ఉంది. దీనిపై పాడిరైతులు సోమవారం నిరసన చేయనున్నట్లు తెలిపారు.

కియలో అనంత నిరుద్యోగులకు అవకాశం ఇవ్వండి: ఎంపీ



కియ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 8 : కియ పరిశ్రమలో స్థానికంగా నిరుద్యోగ యువతీయువకులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కంపెనీ ప్రతినిధులను కోరారు. శనివారం పెనుకొండ సమీపంలోని కియ కార్ల పరిశ్రమను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతినిధులతో కంపెనీ ఉత్పత్తులపై ఆరాతీశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. కియ పరిశ్రమకు రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్ని వసతులు కల్పిస్తారన్నారు. కరువుకు నిలయమైన అనంతపురం నిరుద్యోగులకు కంపెనీ అండగా నిలవాలని కోరారు. కియా ప్రతినిధులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు ఆస్తులకు రక్షణ కల్పించండి

హిందూపురం అర్బన్ : వక్ఫ్‌బోర్డుకు సంబంధించన ఆస్తులను రక్షించాలని హిందూపురంకు చెందిన అఖిల భారతషాహిద్ టిప్పూ సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయఅధ్యక్షుడు ఉమర్‌ఫరూక్ కోరారు. ఆదివారం అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ స్వగృహంలో ముస్లీంలు ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లింల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని దాతలు కోట్ల విలువైన భూములను దానం చేశారన్నారు. అయితే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టాలని చూస్తున్నారన్నారు. ఎంపీ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ముస్లింకు అండగా ఉంటాదన్నారు. ముస్లిం మతపెద్దలు తబ్లిక్ జమాత్ సభ్యులు సాధిక్‌సాబ్, సాలెహ, హదీస్, జమాత్ అధ్యక్షుడు మౌలానా ఉస్మాన్, ఘనీ, అహలే, సున్నతుల్ జమాత్ అధ్యక్షుడు దౌలాసాబ్, ముస్లిం ఉలామాలు, సామాజిక సేవకులు అజమతుల్లాఖాన్, ఉబేదుల్లా పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి



పోటీలను ప్రారంభిస్తున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిరటౌన్, సెప్టెంబరు 8: ఉపాధ్యాయులు క్రీడాపోటీల్లో పాల్గొనడం వల్ల శారీరక, మానసిక ఉల్లాసం పెరిగ ఒత్తిడి దూరమవుతుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. ఆదివారం మడకశిర జూనియర్ కళాశాల మైదానంలో యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా జిల్లా స్థాయి క్రీడాపోటీలను ఏర్పాటు చేశారు. పోటీలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ 117 జీఓపై సీఎం చంద్రబాబు నాయుడు సానుకూల నిర్ణయం తీసుకుంటారన్నారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్ ఉపాధ్యాయులపై కక్ష కట్టి వేధించారన్నారు. ఉపాధ్యాయులను వైన్ షాపుల వద్ద కాపలాగా పెట్టిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. క్రీడా మైదానంలో షెటిల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, వాలీబాల్ టోర్నమెంట్‌లతోపాటు 100, 200, 400 మీటర్ల పరుగుపందేలు, జావిలిన్ త్రో వంటి పోటీలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, గౌరవ అధ్యక్షుడు భూతన్న, కార్యదర్శి సుధాకర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, జిల్లా స్థాయి ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 8: ఆంధ్రప్రదేశ్ నైనుణ్యాబివృద్ధి సంస్థ, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు మంగళవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ హరీష్‌బాబు, ఏపీఎస్ఎస్‌డీసీ అధికారి అబ్దుల్ ఖయ్యూం ఓ ప్రకటనలో పేర్కొన్నాడు. 10వ తేదీ ఉదయం నాలుగు కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, డిప్లమా, పూర్తి చేసి 18 నుంచి 35 సంవత్సరాలు లోపు వయసు కలిగి ఉండాలన్నారు. అర్హతను బట్టి రూ. 12వేల నుంచి రూ. 20 వేల వరకు జీతం ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులు అనంతపురం, బెంగళూరు, హైదరాబాద్ లలో ఉద్యోగాలు చేయవలసి ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ ఆధార్‌కార్డు, విద్యార్హత పత్రాలు జిరాక్స్ కాపీలతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. వివరాలకు 9966682246ను సంప్రదించాలన్నారు.

సైకిల్ యాత్ర



యువకుడిని అభినందిస్తూ..

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 8: కోల్‌కతాలో దారుణంగా హత్యకు గురైన జూనియర్ వైద్యురాలికి న్యాయం జరగాలని కోరుకుంటూ ఓ యువకుడు ఆల్‌ఇండియా సైకిల్‌యాత్రను చేపట్టాడు. సైకిల్ యాత్ర శనివారం పెనుకొండకు చేరుకుంది. కాకినాడకు చెందిన వంశీ అనే యువకుడు సైకిల్‌లో ఆల్ ఇండియా యాత్ర చేపట్టినట్లు తెలిపాడు. ఎన్ఎహెచ్ ఆర్‌సీ ఎన్‌డీటీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ హరిలాల్‌నాయక్, సౌత్ ఇండియా కౌన్సిలర్ రంజిత్ నాయక్ యువకుడిని అభినందించారు.

హెంజేరు సిద్దేశ్వరస్వామికి విశేష పూజలు

మడకశిర(అమరాపురం), సెప్టెంబరు 8 : అమరాపురం మండలంలోని హేమావతి గ్రామంలో ఆదివారం హేమావతి హెంజేరు సిద్దేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం మహా మంగళారతి, కుంకుమార్చన, తైలాభిషేకం, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. స్వామికి వెండి కవచములు ధరించి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదం అందజేశారు. ఈకార్యక్రమంలో అర్చకులు సిద్దలింగేశ్వరస్వామి, శివకుమార్ స్వామి, మహేష్‌స్వామి, గౌతమ్, ప్రదీప్ అన్నదానం నిర్వహించారు.



అలంకరణలో సిద్దేశ్వరస్వామి

వరదలో జగన్ బురద రాజకీయం

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ


రాయదుర్గం, సెప్టెంబరు 8: తనను ఓడించిన జనంపై కక్షతో మాజీ ముఖ్యమంత్రి జగన్ వరదలో బురద రాజకీయం చేస్తున్నాడని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. ఆయన తన నివాసంలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తనను ఓడించిన జనంపై కక్ష తీర్చుకోవడానికి వరదలను ఎంచుకోవడం జగన్ నీచరాజకీయానికి నిదర్శన మన్నారు. ఒక్క రూపాయి సాయం చేయకపోగా, ప్రభుత్వం చేసే సాయానికి సహకరించకుండా విమర్శలు చేస్తున్నాడని మండిపడ్డారు. బుడమేరు గట్ల పటిష్టత, ఆధునికీకరణ కోసం 2017-18లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా రూ. 220 కోట్లు మంజూరు చేశారన్నారు. బుడమేరు నుంచి 37 వేల క్యూసెక్కుల నీరు వచ్చినా వాటిని కృష్ణా నదిలోకి కలపడానికి చేపట్టిన పనుల్లో కొన్ని జరిగా యన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక వాటిని పూర్తిగా నిలిపేశారన్నారు. ఈ విషయాన్ని అప్పటి ఆయన పార్టీలో ఎమ్మెల్యేగా ఉన్న వసంత కృష్ణప్రసాద్ బహిర్గతం చేశారన్నారు. ఈ బుడమేరు పాపం పూర్తిగా జగన్‌మోహన్‌రెడ్డి వైఫల్యమేనని ధ్వజమెత్తారు. గత పాలకుల పాపాలే విజయవాడ ప్రజలకు శాపాలుగా మారాయన్నారు.

అనంత డీసీసీ అధ్యక్షుడిగా మధుసూదన్‌రెడ్డి


ఉరవకొండ, సెప్టెంబరు 8: అనంతపురం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉరవకొండ మండలం రాకెట్ల గ్రామానికి చెందిన వై. మధుసూదన్‌రెడ్డి నియమితులయ్యారు. ఏఐసీసీ నుంచి నియామక ఉత్తర్వులు శనివారం వెలువడ్డాయి. మధుసూదన్‌రెడ్డి ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘంలో పని చేశారు. ఈక్రమంలోనే 1982లో జరిగిన విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఆర్ట్స్ కళాశాల ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2009లో కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యదర్శిగా పనిచేశారు. అనంతరం వైసీపీలో చేరి కొన్నేళ్ల పని చేశారు. ఆపార్టీ 2023లో సస్పెన్షన్ వేటు వేయడంతో కొన్ని రోజులు రాజకీయాలకు దూరమయ్యారు. తదనంతరం జరిగిన పరిణామాల్లో ఆయన తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరి ఉరవకొండ అభ్యర్థిగా 2024లో పోటీ చేశారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ తన ఎంపికకు సహకరించిన రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు షర్మిలకు ధన్యవాదాలు తెలిపారు.



పురంలో గౌరమ్మకు జడలు వేస్తున్న వినాయక, కుమారస్వామి



పురం కోటలో..




పాత టూటౌన్ పోలీస్ స్టేషన్లో..

కొలువు దీరిన గణనాథుడు

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్, సెప్టెంబరు 8: విఘ్నాలు తొలగించే వినాయకుడు, గౌరీపుత్రుడు వాడవాడలా కొలువు దీరాడు. గ్రామాల్లో, పట్టణాల్లో ఈ సారి ఉత్సాహంగా వినాయకులను ప్రతిష్ఠించారు. మంటపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి వినాయకున్ని దర్శించి ప్రతేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందుకున్నారు. డిజేల మోతలు, ఫోకస్‌లైట్లు, డ్రమ్స్ మోతలతో యువత కేరింతలతో మండపాల పరిసర ప్రాంతాలు మోగిపోతున్నాయి. సాయంత్రం పిల్లా, పెద్దలు వినాయకులను దర్శించుకుని పూజలు నిర్వహించారు. పలువురు నాయకులు గణనాథులను దర్శించుకుని పూజలు నిర్వహించారు. రకరకాల రూపాల్లో గణనాథుడి విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి.





పెనుకొండ ఎరువగడ్డలో... తోటగేరిలో..



రేపాకులో..



బెంగళూరు రోడ్డులో..



సోమందేపల్లిలో..





మడకశిరలో..



గుడిబండలో..



రొద్దంలో..



లక్ష్మీపురంలో వినాయక సేవాసమితి ఆధ్వర్యంలో..